క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

ఉమా చంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని చంద్రగార్డెన్స్‌లో ఉన్న ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, పూజల్లో పాల్గొన్నారు. స్వామికి రుద్రాభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ఉదయ్‌కృష్ణ శర్మ, ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

బొత్సతో ఆత్మీయ భేటీ



బొత్సను కలిసిన పరవాడ వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణను పరవాడ వైఎస్సార్‌సీపీ నేతలు విశాఖ నగరంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలపై కాసేపు మాట్లాడారు. బొత్సను కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు వెన్నల సన్యాసిరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు పైల అప్పలనాయుడు, బొద్దపు చిన్నారావులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2 అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధి 33/11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధి గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, బోదువలస, అయ్యన్నపాలెం, వంగలి, రాయపుర అగ్రహారం, టిక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొటివాడ, పెదయాతపాలెం, బంగారమ్మపాలెం, అడ్డూరు, ఎల్లుప్పి, లగిసెట్టిపాలెం, గాలిభీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత




పెయింటింగ్ విజేతలతో నిర్వాహకులు

ఉక్కునగరం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఇందు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతి ఎం.మధుసూదనరావు అన్నారు. అర్బిగా ఫౌండేషన్, గ్రీన్ ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు డీఏవీ స్కూల్లో పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో రాష్ట్రంలోని 84 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం విజేతలకు మధుసూదనరావు, పాఠశాల హెచ్‌ఎం సుగంధ కుమారి, గ్రీన్ ట్రీస్ ట్రస్ట్ చైర్మన్ దొడ్డి సన్నిబాబు, అర్బిగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు హరి గణేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుడ్డ సంచులు పంపిణీ చేశారు.



'మా వార్డుల్లో కూటమి భాగస్వాములుగా మేమున్నా ఏ ప్రభుత్వ కార్యక్రమానికి గానీ, అభివృద్ధి కార్యక్రమాలకు గానీ మమ్మల్ని ఆహ్వానించట్లేదు. టీడీపీ, జనసేన నాయకులు.. కనీసం ప్రొటోకాల్ అంటే ఏంటో తెలియని విధంగా ప్రవర్తిస్తున్నారు. వార్డులోని బీజేపీ కార్పొరేటర్‌కు కూడా సమాచారం ఇవ్వకుండా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి, ఫొటోలకు పోజులిస్తున్నారు. ఇదేనా కూటమి పొత్తు ధర్మం'

– టీడీపీ, జనసేనపై 95, 97వ వార్డుల బీజేపీ అధ్యక్షుడు చిక్కాల సతీష్ ఆక్షేపణ



- పెందుర్తిలో కూటమి పెద్దన్న బీజేపీను ఖాతరు చేయని టీడీపీ, జనసేన
- ప్రభుత్వ, అభివృద్ధి కార్యక్రమాలకు బీజేపీని దరిచేరనివ్వని మిత్రపక్షాలు
- బీజేపీ నేతలను, కార్యకర్తలను అంటరానివారిగా చూస్తున్న వైనం
- బహిరంగంగానే తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కుతున్న కాషాయ దళం

కూటమిలో కరివేపాకు.. కమలం

పెందుర్తి: నియోజకవర్గంలో అధికార ఎన్డీయే కూటమిలో పెద్దన్న స్థానంలో ఉన్న బీజేపీ నాయకులను, కార్యకర్తలను మిత్రపక్షాలు పట్టించుకోవడం మానేశాయి. టీడీపీ, జనసేన ముఖ్య నేతలు సహా కేడర్ అంతా బీజేపీ కేడర్‌ను పురుగులను చూసినట్లు చూస్తున్నారు. ఏకంగా బీజేపీకి చెందిన కీలక నేతే ఎంపీగా ఉన్నా పెందుర్తి నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీని టీడీపీ, జనసేన పార్టీలు ఖాతరు చేయడం లేదు. చివరకు పట్టణ ప్రాంతంలో ఉన్న ఏకైక కార్పొరేటర్‌ను సైతం ప్రభుత్వ, అధికారిక, అభివృద్ధి కార్యక్రమాలకు దూరంగా ఉంచుతున్నారంటే బీజేపీ పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే నియోజకవర్గంలో కమలం పార్టీ టీడీపీ, జనసేనకు కరివేపాకు కంటే హీనంగా కనిపిస్తోందని బీజేపీ నేతలే వాపోతున్నారు.

వాస్తవానికి నియోజకవర్గంలో బీజేపీకి అంత సీన్ లేదు. అయితే ఎన్నికల సమయంలో కూటమి భాగస్వామిగా ఉన్న బీజేపీలో అతి కొద్ది మంది నాయకులను టీడీపీ, ముఖ్యంగా పోటీలో ఉన్న జనసేన నాయకులు 'నువ్వు లేక నేను లేను' అన్నంతగా అక్కున చేర్చుకున్నారు. ఉన్న నాలుగు ఓట్లను వేయించుకున్నారు. ఎన్నికల వేళ మిత్రపక్షాల నటన చూసి అధికారంలోకి వచ్చాక వారితో కలిసి నియోజకవర్గంలో చక్రం తిప్పేద్దాం.. అని కమలం కేడర్ భావించింది. అదే సమయంలో అనకాపల్లి ఎంపీగా

కేడర్ లేక.. ఖాతరు చేయక

బీజేపీ సీఎం రమేష్ ఉండడంతో తమకు తిరుగులేదని భ్రమల్లో విహరించారు. ఈ నేపథ్యంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు సహా కొందరు వార్డు, పంచాయతీ స్థాయి నాయకులు బీజేపీలో చేరిపోయారు. తీరా రోజులు గడుస్తున్న కొద్దీ బీజేపీలో ఉన్న పాతకాపులతో పాటు కొత్తగా చేరిన వారికి తత్వం బోధపడుతూ వచ్చింది. ఇటు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు గానీ, అటు టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ గానీ ఆయా పార్టీల కేడర్ సైతం బీజేపీని పట్టించుకోవడం మానేశాయి. చివరకు మిత్రపక్షంలో చోటామోటా నాయకులు సైతం బీజేపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను 'మీరెవరు' అన్నట్లు చూస్తుండడంతో బీజేపీ కేడర్‌కు మంట నషాలానికెక్కుతోంది.

వలస పక్షులకు జెల్ల

వైఎస్సార్‌సీపీలో ఐదేళ్ల పాటు అధికార దర్పాన్ని ప్రదర్శించిన గోడమీద పిల్లి లాంటి కొందరు నాయకులు, కార్యకర్తలు అధికారం కోల్పోగానే కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీల వైపు చూశారు. అయితే ఇటు జనసేన, అటు టీడీపీ కేడర్ వారి రాకను అడ్డుకున్నాయి. దీంతో మరో గతి లేక ఒకరిద్దరు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, కొందరు నాయకులు బీజేపీ పంచన చేరారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఎంపీ సీఎం రమేష్ కాళ్లావేళ్లాపడి 'కాషాయ' రంగు పులిమేసుకున్నారు. అయితే ఎంపీ పెందుర్తి వైపు కన్నెత్తి చూడకపోవడం.. ఇక్కడ ఉన్న జనసేన, టీడీపీ ముఖ్యనేతల ఆధిపత్య పోరు, పెత్తనం నడుమ బీజేపీలో చేరిన వలస పక్షులకు మర్యాద లేకుండా పోయింది. ఎంతలా అంటే వారి వారి ప్రాంతాల్లోనే ప్రభుత్వ కార్యకలాపాలకు ఆహ్వానం లేనంత దుస్థితిలో ఉన్నారు. దీంతో నియోజకవర్గంలో, మరీ ముఖ్యంగా పెందుర్తి పట్టణ ప్రాంతంలోని కాషాయ కేడర్ 'మా గూడు చెదిరింది.. మా గుండె పగిలింది' అంటూ విషాదగీతాలు పాడుకుంటున్నారు.

ప్రభుత్వ కాలనీల్లో సమస్యల పరిష్కారానికి వినతి



అనకాపల్లి డీఆర్వోకు వినతి పత్రం అందిస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ: మండలంలోని గొర్లివానిపాలెం వద్ద నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్ఎం, టిడ్కో గృహ సముదాయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో పాల్గొని సమస్యలపై వినతిపత్రాన్ని కలెక్టర్ పేరిట డీఆర్వో సత్యనారాయణకు అందించారు. కాలనీల్లో రేషన్ డిపో ఏర్పాటు, చెత్తబండి, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. రేషన్ డిపో లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న డిపోకు వెళ్లి సరకులు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. కాలనీల్లోకి చెత్త బండి రాకపోవడంతో వీధులన్నీ చెత్తతో పేరుకుపోతున్నాయన్నారు. ఫలితంగా దోమలు పెరిగిపోయి రాత్రి సమయంలో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. కాలనీల్లో వీధి దీపాల్లేకపోవడంతో రోజు రోజుకూ దొంగల భయం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చీకటి పడితే రోడ్లపై విష జంతువుల సంచారంతో ఇల్లు విడిచి బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారన్నారు. ప్రజలు సమస్యలను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో కోరారు. ఆమె వెంట ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు బంగారమ్మ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 12 వినతులు

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 12 వినతులు అందాయి. రెవెన్యూ, భూ ఆక్రమణలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడారు. వారి ద్వారా వివరాలు సేకరించారు. అనంతరం ఆయా శాఖల అధికారులకు ఆ ఫిర్యాదులను అందించి, విచారణ చేసి త్వరితగతిన పరిష్కారమయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రావెల్‌తో గోతులు పూడ్చారు

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: మండలంలోని బొట్టవానిపాలెం–రేకవానిపాలెం గ్రామాల మధ్య అధ్వానంగా మారిన రహదారికి రావాడ గ్రామ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు చొరవతో మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 14న 'అధ్వాన రహదారితో అవస్థలు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి సర్పంచ్ సన్యాసినాయుడు, అధికారులు స్పందించారు. ఈ రహదారి గత కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరింది. మోకాలి లోతు గోతులతో నిత్యం ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా గోతులు నీటితో నిండిపోయి, ప్రయాణికులు వాటిని గుర్తించకుండా రాకపోకలు సాగిస్తున్న క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో సాక్షి కథనంపై స్పందించిన సర్పంచ్ పొక్లెయిన్ సాయంతో గ్రావెల్ గోతుల్లో వేసి, తాత్కాలిక మరమ్మతు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మతులకు చొరవ చూపిన సర్పంచ్‌ను ప్రజలు అభినందించారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.



గొల్లగరువు వద్ద రోడ్డుపై గోతుల్ని పూడ్చుతున్న దృశ్యం

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం



పెందుర్తి బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిక్కాల సతీష్, ముమ్మన దేముడు, బీజేపీ నేతలు



శ్యామ్‌ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గొర్లె రామునాయుడు

జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు

పెందుర్తి: జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ సిద్ధాంతకర్త శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని సోమవారం పెందుర్తిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు శ్యాంప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ జాతీయవాది శ్యాంప్రసాద్ ముఖర్జీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

95వ వార్డులో: సుజాతనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో జీవీఎంసీ 95, 97వ వార్డుల బీజేపీ అధ్యక్షుడు చిక్కాల సతీష్ ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతుల మీదుగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ముఖర్జీ సేవలను కొనియాడారు. బీజేపీ నాయకులు పురిజాల బాలసుబ్రహ్మణ్యం, కంచిపాటి సన్యాసిరావు, కాళ్ల జగన్మోహన్, అచ్చం నాయుడు, వెంకటసంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని బీజేపీ నేతలు కొనియాడారు. శ్యామ్‌ప్రసాద్ వర్ధంతిని మండలంలోని అమృతపురంలో సోమవారం నిర్వహించారు. బలిదాన్ దివాస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, బూత్ అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్ కుమార్ ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జన సంఘ్ వ్యవస్థాపకుడైన శ్యామ్‌ప్రసాద్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బలిదాన్ దివాస్ మండల కన్వీనర్ రెడ్డి రామునాయుడు, బీజేపీ సీనియర్ నాయకులు భూపతి అప్పారావు, ఆకాష్ కుమార్, ప్రభు కుమార్, గండి సత్యంనాయుడు, మహిళా నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సబ్బవరం బీజేపీ నేతలు

నేడు బంగారమ్మతల్లి పండగ

రాత్రి అనుపు మహోత్సవానికి విశేషంగా ఏర్పాట్లు



బంగారమ్మతల్లి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత బంగారమ్మతల్లి వార్షిక పండగ మంగళవారం జరగనుంది. అమ్మవారి పండగను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం, గ్రామస్తులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. ప్రియాగార్డెన్స్‌లోని అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. పుష్పాలు, భారీ ఎత్తున విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు ఉచిత ప్రసాద వితరణకు సన్నాహాలు చేశారు. గ్రామసాంప్రదాయం ప్రకారం రాత్రి అనుపుమహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. పాత అడవివరంలోని బంగారమ్మ సతకంపట్టు నుంచి పూజారి వంశీయులైన లండ కుటుంబీకులు ఘటాలను ఊరేగింపుగా ప్రియాగార్డెన్స్‌లోని ఆలయం వద్దకు రాత్రి తీసుకువెళ్తారు. పండగ మహోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి తొలేళ్ల పండగని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి జోగిని, రాత్రి అమ్మవారి ఘటాలను గ్రామంలోపెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. తొలేళ్ల సందర్భంగా స్థానిక మార్కెట్‌లో దేవస్థానం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



గ్రామంలో జోగి ఊరేగిస్తున్న గుడి పూజారి వంశీయులైన లండ కుటుంబీకులు



సిద్ధం చేసిన అమ్మవారి ఘటాలు

టెన్త్‌లో మెరిశారు.. ట్రిపుల్ ఐటీ సాధించారు



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు వరుసగా ఆసం అఖిల్(శ్రీకాకుళం), కొరుబిల్లి కుసుమ(నూజివీడు), పెంటకోట వైశాలి(నూజివీడు), కాళ్ల విరాజిత(శ్రీకాకుళం), బి.ఉదయ్‌కిరణ్(శ్రీకాకుళం)

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు రాజీవ్ ట్రిపుల్ ఐటీలో మెరిశారు. రాష్ట్రంలోని పలు ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు ఎంపికయ్యారు. మండలంలోని చింతలగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు పొందిన కోరుబిల్లి కుసుమ, పెంటకోట వైశాలి నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందారు. అదే పాఠశాలకు చెందిన కాళ్ల విరాజిత, బి.ఉదయ్‌కిరణ్, పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఆసం అఖిల్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెందుర్తి: పెందుర్తి బీఆర్‌టీఎస్–పులగానివానిపాలెం రోడ్డు సూర్యనగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కాలనీకి చెందిన సారిపల్లి సూర్యనారాయణశాస్త్రి(70) వ్యక్తిగత పని మీద పెందుర్తి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన



ఎంపీడీవో పద్మజకు వినతిపత్రం అందిస్తున్న ఇరువాడ ఎస్సీ, బీసీ కాలనీ మహిళలు



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ఇరువాడ మహిళలు

సబ్బవరం: తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మండలంలోని ఇరువాడ శివారు ఎస్సీ, బీసీ కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. కాలనీ ఏర్పాటై 30 ఏళ్లవుతున్నా.. కనీస వసతులకూ నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఎంపీడీవో బి.పద్మజకు తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీకి ఇరువాడ గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి నిధులు మంజూరు కావట్లేదని ఆరోపించారు. అసకపల్లి ఎంపీటీసీ పరిధిలోని తమ కాలనీకి మండల పరిషత్ నిధులు ఖర్చు చేయట్లేదని ఆక్షేపించారు. ఎప్పుడైనా ఎస్సీ గ్రాంట్ వస్తే తప్ప, ఎలాంటి అభివృద్ధికి తమ కాలనీ నోచుకోవట్లేదని వాపోయారు. కాలనీ ఏర్పాటైన సమయంలో నిర్మించిన మంచినీటి సరఫరా పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందన్నారు. దీంతో సుమారు కిలో మీటర్ దూరం నుంచి పైప్ లైన్లు వేసి మంచినీటిని పంపింగ్ చేస్తుండటంతో తరుచూ పైపులైన్‌లు పగిలి నీరు వృథా అవడంతో పాటు, తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవట్లేదని ఆక్షేపించారు. సమస్యను పరిష్కరించి తగిన న్యాయం చేయాలని ఎంపీడీవోను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎం.ముత్యాలమ్మ, పి.భాగ్యలక్ష్మి, ఎస్.జయలక్ష్మి, టి.మోహిని, ఎస్.పుష్ప, దేవుడమ్మ, ఎం.మహాలక్ష్మి, పి.ముత్యాలమ్మ, టి.సత్యవతి, నెల్లి పార్వతి తదితరులున్నారు.



● పువ్వల్లే.. నువ్వుల్!

పంట భూమి మేను పచ్చరంగు అలుముకుంటే ఆ అందమే నాయనానందకరం. అలాంటిది కొన చివరన పూలు విరబూసి గింజ కట్టే దశలో ఆ శోభ వర్ణనాతీతం. వేసవి రబీ పంట నువ్వు చేను పువ్వులతో నవ్వులు రువ్వుతోంది. ఈ ఏడాది పెందుర్తిలో ఆరుతడి పంటగా నువ్వు సాగును కొందరు రైతులు చేపట్టారు. దీనికి పెద్దగా నీటితో పనిలేకున్నా.. వేసవిలో అడపాదడపా కురిసిన వానలకు నువ్వు చేలు ఏపుగా ఎదిగాయి. ప్రస్తుతం పూలు పూసి, గింజ కట్టే దశకు చేరుకున్నాయి. పొలమంతా నువ్వుచేను పువ్వులతో నవ్వులు రువ్వుతున్నట్టు శోభాయమానంగా కనిపిస్తోంది. -పెందుర్తి